ప్రయాణ ప్రయాస

- ఉచిత ప్రయాణం అంటే ఇంత దారుణమా?
- రామాయంపేట బస్టాండు నిండా మహిళా ప్రయాణికులే..
- బస్సు ఎక్కేందుకు కుస్తీ పడుతున్న స్త్రీలు

బస్సెక్కేందుకు ఇబ్బందులు పడుతున్న మహిళలు

మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిన రామాయంపేట బస్టాండు

రామాయంపేట, ఏప్రిల్ 15: ఉచిత ప్రయాణంతో ఏ ఊర్లో చూసినా, ఏ బస్టాండులో చూసినా మహిళా ప్రయాణికులే కనిపిస్తున్నారు. బస్సు ప్రయాణం ఉచితం కావడంతో మహిళలు ఏ పనికైనా ఎక్కడికి వెళ్లాల్సి వచ్చినా ఆధార్‌కార్డు తీసుకుని బస్టాండు బాట పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్టాండ్లు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. దీంతో ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం వర్కింగ్ డే కావడంతో రామాయంపేట బస్టాండు కిటకిటలాడింది. అప్పుడే మెదక్ బస్సు రాగానే వందల సంఖ్యలో మహిళలు చేరుకుని నువ్వా నేనా అంటూ ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లి బస్సెక్కారు. బస్టాండ్‌లో వందల మంది మహిళలుంటే పదుల సంఖ్యలో పురుషులు కనిపించడం విశేషం. బస్సు వద్ద ప్రయాణం చేయడం కోసం మహిళలు కుస్తీపడుతున్నారు. బస్టాండులోనే ఇలా ఉంటే మరి బస్సులో మరీ దారుణం.

ఎనగండ్లలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 15: కొల్చారం మండలంలోని ఎనగండ్ల, వరిగుంతం గ్రామాల్లో ఎల్లమ్మ, హనుమాన్ విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించారు. ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో ఎంపీపీ మంజుల, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు చెల్లింపులు షురూ..

- 108 మెట్రిక్ టన్నులకు రూ.24.05 లక్షలు రైతుల ఖాతాల్లో జమ
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రైతుల నుంచి కొంటున్న ధాన్యానికి చెల్లింపులు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల నిర్వహణపై పౌర సరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హవేళీ ఘనపూర్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లో 108 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని, అందుకు 14 మంది రైతులకు రూ. 24.05 లక్షలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశామని తెలిపారు. రవాణా సంబంధిత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కొనుగొలులో ఉన్న ఇబ్బందులు, మార్కెట్ ధరను దృష్టిలో ఉంచుకుని రైతులు దశల వారీగా ధాన్యాన్ని తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కనీస మద్దుతు ధరకంటే తక్కువకు ఎవరైనా కొంటే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రాలకు ధాన్యం వచ్చినప్పుడు వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ పత్రాలు తెచ్చుకునేలా చూడాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరి కృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఒకరు మృతి

తూప్రాన్, ఏప్రిల్ 15: ఆటోను వెనుక నుంచి స్పీడుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి హల్దీవాగు బ్రిడ్జి వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన అంబర్‌పేట అఖిల్, పెద్ద నాన్న యాదగిరి కూతురు శ్రావణి పెండ్లి బట్టలు కొందామని ట్రాలీ ఆటోలో తూప్రాన్‌కు బయలు దేరారు. ఆటోలో తల్లిదండ్రులు బాలకృష్ణ, రాధ, పెద్ద నాన్న యాదగిరి, పెద్దమ్మ మంజుల, శ్రావణి, తమ్ముడు అరవింద్‌తో కలిసి వారు ప్రయాణిస్తున్నారు. ఆటో తూప్రాన్ సమీపంలోని హల్దీవాగు బ్రిడ్జిపైకి రాగానే అతివేగంగా వచ్చిన కారు వెనక నుంచి ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. కారు టైరు అఖిల్ తలపై నుంచి వెళ్లి, డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో అఖిల్ తల పగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. ట్రాలీలోని వ్యక్తులంతా కింద పడ్డారు. అందరికీ గాయాలయ్యాయి. అఖిల్ తండ్రి కారు వద్దకెళ్లి చూడగా మద్యం మత్తులో కారు నడుపుతున్నాడని, వివరాలు అడగగా పోతరాజ్‌పల్లికి చెందిన నవీన్‌గౌడ్ అని తెలిపాడు. క్షతగాత్రులను 108లో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కారు డ్రైవర్ నవీన్ గౌడ్‌ను తూప్రాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గియాసున్నీబేగం

చేగుంట, ఏప్రిల్ 15: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ గియాసున్నీబేగం తెలిపారు. సోమవారం చేగుంటలోని స్థానిక బస్టాండ్, గాంధీ చౌరస్తాలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, నోడల్ అధికారి నీరజ, రెవెన్యూ సిబ్బంది రవీందర్‌రెడ్డి, రాజేశ్, భూమేశ్, కవిత, మొగులయ్య, ఉపాధ్యాయులు, బీఎల్‌వోలు, ఐకేపీ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు చేగుంటలో బీఆర్ఎస్ పార్లమెంట్ సమన్వయ సమావేశం

చేగుంట, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ పార్లమెంట్ సమన్వయ సమావేశాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని వడియారం ఎస్ఎల్‌వీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

అల్లాదుర్గం, ఏప్రిల్ 15: మండలంలోని రాంపూర్ శివారులో పెద్దమ్మ తల్లి విగ్రహ పున ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం పురోహితుడు శిలాంకోట ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో శేషారెడ్డి, లక్ష్మయ్య, రఘురాంరెడ్డి, సంజీవ్‌రెడ్డి, రఘుపతి, వెంకట్, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిలిపిచెడ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

చిలిపిచెడ్, ఏప్రిల్ 15: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కోసం పైపులైన్లు, మోటర్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకుంటే పంచాయతీ బోర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల హాజరుశాతం పెంచేలా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో శరత్‌రెడ్డి, ఏపీవో శ్యామ్‌కుమార్, కార్యదర్శులు తిరుపతి, జితేందర్, ఆనంద్, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు

మెదక్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌తో సహా పలువురు కౌన్సిలర్లు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, 2వ వార్డు కౌన్సిలర్ కొర్వి వేదవతి రాములు, 4వ వార్డు కౌన్సిలర్ నర్మద శ్రీధర్ యాదవ్, 6వ వార్డు కౌన్సిలర్ రాగి వనజఅశోక్, 7వ వార్డు కౌన్సిలర్ శంసున్నీసాబేగం అంజాద్, 11వ వార్డు కౌన్సిలర్ షమీ, 20వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, 21వ వార్డు కౌన్సిలర్ పెండ్యాల నిర్మల నిఖిల్, 29వ వార్డు కౌన్సిలర్ బొద్దుల రుక్మిణి కృష్ణ, 32వ వార్డు కౌన్సిలర్ గోదల మానస సాయిరాం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఉమేర్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ వెంకటనారాయణలకు మైనంపల్లి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమం లో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అరునార్తి రమణ, బొజ్జ పవన్, మేడి మధుసూదన్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, సుప్రభాత్‌రావు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

గజ్వేల్-రామాయంపేట రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు

రామాయంపేట, ఏప్రిల్ 15: అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘం, రామాయంపేట ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలిసిన నాయకులు రోడ్డెక్కారు. గజ్వేల్- రామాయంపేట రోడ్డుపై కంచె వేసి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్, నిజాంపేట, నార్సింగి ఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని వారిని శాంతింపజేసి, రాస్తారోకోను విరమింపజేశారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15: రామాయంపేట మండలం ఆర్. వెంకటాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రేగోడ్, ఏప్రిల్ 15: లింగంపల్లి గ్రామానికి చెందిన మచ్చారి నాగమ్మ మృతి చెందింది. సోమవారం విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ మంజులతో కలిసి మృతురాలి దహన సంస్కారాలకు రూ.10 వేల నగదు అందజేశారు.

19న మండల సర్వసభ్య సమావేశం

నిజాంపేట, ఏప్రిల్ 15: ఈ నెల 19న నిజాంపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సిద్ధిరాములు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేవంత్‌రెడ్డి.. రుణమాఫీ ఏమైంది?

- దేశంలో అడుగడుగునా మోదీ అభివృద్ధి కనిపిస్తున్నది
- కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అమలైనవి ఎన్ని?
- భూములు కబ్జా చేసే వ్యక్తికి టికెటిచ్చారు
- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు

తూప్రాన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

తూప్రాన్, ఏప్రిల్ 15: డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైంది రేవంత్‌రెడ్డి అని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 4 నెలలు గడుస్తున్నా ఒక్క హామీ నెరవేరలేదన్నారు. సోమవారం తూప్రాన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పెట్టి, ఆటోడ్రైవర్ల పొట్టకొట్టిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతా అన్న చిన్న కొడుకు రేవంత్ రెడ్డి మాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. మహాలక్ష్మిల్లాగా చూస్తానని నెలకు రూ.2500లు ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైందని మహిళలను ప్రశ్నించారు. రాష్ట్రంలో నీళ్లకు కొరత ఉందేమోగానీ, మద్యానికి కొరత లేదన్నారు. భూముల్ని దొంగతనంగా ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో తెలిసిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చారని, ఏం చదువుకున్నాడో తెలియని వ్యక్తి రేపు గెలిస్తే పార్లమెంటులో ఏం మాట్లాడుతాడని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ పనిచేస్తోందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీకి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భూమన్నగారి జానకీరామ్‌గౌడ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, జంగంపేట సాయిబాబాగౌడ్, జమాల్‌పూర్ నర్సోజీ, వర్గంటి రామ్మోహన్‌గౌడ్, శివ్వమ్మ, అంజాగౌడ్, మహేశ్‌గౌడ్, తాటి విఠల్, గడ్డం రవీందర్, నత్తి మల్లేశ్, సిద్ధిరాములు యాదవ్, చంద్రశేఖర్, పిట్ల పోచయ్య, కార్తిక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

అల్లాదుర్గం, ఏప్రిల్ 15: మండలంలోని చేవెళ్ల, అల్లాదుర్గంలో జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు బ్రహ్మం, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, మండల అధ్యక్షుడు యాదగిరి, సాయిలుగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

రామాయంపేట, ఏప్రిల్ 15: రామాయంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా సమేత వేంకటేశ్వరస్వామి పద్మావతి ఉత్సవాలను ఆలయ కమిటీ నిర్వహిస్తున్నది. సోమవారం అమ్మవారి సన్నిధికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు వెంకటరమణచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీపతి, సభ్యులు కొవ్వూరి లక్ష్మణ్‌గుప్తా, ఎనిశెట్టి అశోక్, వెంకన్న పంతులు, సత్యనారాయణ, రాఘవేందర్‌చారి, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కొడుపాకలో పోచమ్మకు బోనాలు

పాపన్నపేట, ఏప్రిల్ 15: మండలంలోని కొడుపాకలో పోచమ్మతల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవతలకు అలంకరణ, అభిషేకం, ఒడిబియ్యం, అన్నదానం చేశారు. సాయంత్రం బోనాలు ఊరేగించారు.

'ప్రజావాణి'లోనే సమస్యల పరిష్కారం

- ఎస్పీ బాలస్వామి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు నేరుగా చెప్పుకోవచ్చన్నారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తూప్రాన్ మండలానికి చెందిన గోలి శ్రీనివాస్ తల్లి ప్రమీల పేరుపై శివ్వంపేటలో 1521 సర్వేలో ఓపెన్ ప్లాట్ (భూమి విస్తీర్ణం 1170 చ.గజాలు) ఉందని, ఆ ప్లాట్‌ను సంతకాలను ఫోర్జరీ చేసి శివ్వంపేట మాజీ సర్పంచ్ పులిమామిడి స్రవంతి నవీన్ కుమార్, పంచాయతీ కార్యాలయ లెటర్ హెడ్‌లపై ఏప్రిల్ 5, 2019న రెండు యాజమాన్య ధృవీకరణ పత్రాలు సృష్టించారన్నారు. తమ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తగిన న్యాయం చేయమని శివ్వంపేట్ ఎస్సైకి ఆదేశాలు ఇచ్చారు. తన కూతురు పెళ్లి చేసినందున అప్పులు అయ్యాయని, సొంత స్థలం విక్రయించుకుందామని అనుకుంటుండగా, తిప్పరబోయిన సత్యం తన కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తున్నాడని నార్సింగి గ్రామానికి చెందిన తిప్పరబోయిన సిద్దిరాములు ఫిర్యాదు చేశాడు. చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని నార్సింగి ఎస్సైకి సూచించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15:బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని సూరారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కరణం సిద్దిరాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ అనురాధ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, నాగరాజు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం చేయొద్దు

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రామాయంపేట సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దని, వెంటనే సమాచారమిస్తే నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటామని అగ్నిమాపక సిబ్బంది అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రామాయంపేటతో పాటు మండలంలోని అక్కన్నపేటలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ఇండ్లలో, పశువుల కొట్టాల్లో, ఇతర ప్రాంతాల్లో సైతం ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయే తెలిపి, నివారించే పద్ధతులపై అవగాహన కల్పించారు. వారం రోజులు ప్రభుత్వం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నదని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు నవీన్, శంకర్, కే.శంకర్, ఎం.బాలరాజు, చంద్రాగౌడ్, బాబు, లింగం తదితరులు ఉన్నారు.

కేసీఆర్ సభకు కొల్చారం నుంచి 2000 మంది

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 15: సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న కేసీఆర్ భారీ బహిరంగ సభకు కొల్చారం మండలం నుంచి రెండు వేల మంది కార్యకర్తలను తరలిస్తామని పార్టీ మండలాధ్యక్షుడు గౌరీశంకర్ తెలిపారు. ప్రతి కార్యకర్తకు వాహనాలు అందుబాటు ఉన్నాయన్నారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారన్నారు. కేసీఆర్ హాజరుకానున్న ఈ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడే ప్రజాఆశీర్వాద సభ

రేగోడ్,ఏప్రిల్ 15: కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను మంగళవారం సుల్తాన్‌పూర్‌లో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య ప్రకటనలో తెలిపారు. ఈ సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరుకానున్నారన్నారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జరిగే ఈ సభకు మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు హాజరు కావాలని కోరారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

అల్లాదుర్గం, ఏప్రిల్ 15: అందోల్ నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్ శివారులో మంగళవారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు కోరారు.

గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిందం సబితా రవీందర్

చేగుంట, ఏప్రిల్ 15: తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నార్సింగి ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీపీ చిందం సబితారవీందర్ అన్నారు. సోమవారం నార్సింగిలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలుండవన్నారు. వేసవి దృశ్య తాగు నీటీ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదని, పాత బోర్లకు మోటర్లు ఏర్పాటు చేసి పరిష్కారించుకోవాలని సూచించారు. వడ దబ్బ తగల కుడ జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు పని చోట ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, వైస్ ఎంపీపీ దొబ్బల సుజాత, ఎంపీటీసీలు సత్యనారాయణ, ఆకుల సుజాత, కో-ఆప్షన్ సభ్యుడు ఇలాయాస్, ఎంపీవో నరేశ్, ఎంఈవో బుచ్చయనాయక్, ఏఈఓ యాదగిరి, డాక్టర్ రవికిరణ్, ఐకేపీ ఏపీఎం అశోక్, పంచాయతీ అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.